విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 12 జూలై 2024 8 పేజీలు

విద్యుత్తు చార్జీలతో
పరిశ్రమలు కుదేలు

విశాలాంధ్ర-కొమరోలు : గత ప్రభుత్వ హయాంలో పెరిగిన విద్యుత్ చార్జీలతో చిన్నపాటి పరిశ్రమల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. చిన్నపాటి పరిశ్రమలకు సబ్సిడీ కానీ సహాయ సహకారాలు అందకపోవడంతో పరిశ్రమల నిర్వహణ కుంటుపడింది. ఇటువంటి చిన్నపాటి పరిశ్రమలలో ఉపాధి పొందుతున్న కూలీల భవిష్యత్ ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఎడమకల్లు వద్ద నిర్మించిన శ్రీ లక్ష్మీ నారాయణ ఇండస్ట్రీస్ పరిశ్రమ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. కరువు ప్రాంతంగా పేరు పడ్డ ఈ ప్రాంతంలో కొంతమందికైనా ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో తుమ్మలపెంట శివకుమారి బ్యాంక్‌ల సహకారంతో లక్ష్మీనారాయణ ఇండస్ట్రీస్ పరిశ్రమను 2019 సంవత్సరంలో స్థాపించారు. ఇక్కడ జి.ఐ వైర్, నెయిల్స్ మరియు బైండింగ్ వైర్ తయారు చేస్తున్నారు. మొదట నెలకు 2 లక్షల 30 వేల నుంచి 80 వేల వరకు కరెంట్ బిల్లు వచ్చేది. వరుసగా పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రస్తుతం 5 లక్షల రూపాయల వరకు విద్యుత్ బిల్లులు వస్తూ ఉండడం పరిశ్రమల నిర్వహణ కష్టతరంగా మారిందని ఇండస్ట్రీస్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ రమణ తెలిపారు. అంతేకాకుండా గత ప్రభుత్వం హయాంలో తమకు రావాల్సిన సబ్సిడీలు కూడా అందలేదని నష్టాలతో పరిశ్రమను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ పరిశ్రమలో 30 మందికి పైగా ఉపాధి పొందుతున్నారని వారికి ప్రతినెల ఐదు నుంచి ఆరు లక్షల రూపాయల వరకు జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. పెరిగిన విద్యుత్ చార్జీలతో పరిశ్రమ నిర్వహణ కష్టతరంగా మారడంతో పాటు బ్యాంకుల నుంచి తెచ్చిన రుణాలు కట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పరిశ్రమల మేనేజింగ్ డైరెక్టర్ రమణ అన్నారు.అలానే విద్యుత్ బిల్లులు ప్రతినెల 10వ తారీకు చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులు పట్టు పట్టడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమలకు తోడ్పాటు అందిస్తుంది కాబట్టి పరిశ్రమల నిర్వహకుల సమస్యలను గుర్తించి కరెంటు చార్జీలను తగ్గించడంతో పాటు పరిశ్రమలకు సబ్సిడీలు అందించి సహాయ సహకారాలు అందిస్తే మరి కొంత మందికి పరిశ్రమల నుంచి ఉపాధి కలుగుతుందని శ్రీ లక్ష్మీనారాయణ ఇండస్ట్రీస్ పరిశ్రమల మేనేజింగ్ డైరెక్టర్ రమణ ఆశాభావం వ్యక్తం చేశారు.

సాగుకు అవసరమైన ఇన్‌పుట్‌ను
సిద్ధంగా ఉంచండి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సాగుకు అవసరమైన ఇన్పుట్‌ను ముందుగానే పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. గురువారం ఆమె వ్యవసాయ, దాని అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సాగు వివరాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, సాగు పద్ధతులు, ప్రభుత్వం నుంచి అందిస్తున్న ఇన్పుట్స్ సరఫరా దిగుబడి లక్ష్యాలు, వాటి అంతిమ ఫలితం, సాగులో అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతికత రైతులకు వాటిని చేరవేస్తున్న విధానం, ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతున్న తీరు తదితర అంశాలపై ఆమె ఆరా తీశారు.

ఆయా విషయాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం దృష్ట్యా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సిద్ధం చేయాలని, అర్హులకు సి.సి.ఆర్.సి. కార్డులను త్వరగా మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయంలో ఖర్చును తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించు కునేలా రైతులకు అవగాహన కల్పించి, వారిని ఆ దిశగా ప్రోత్సహించాలని ఆమె చెప్పారు.

జనాభా పెరుగుదలను
నియంత్రించాలి

- కలెక్టర్ వెంకటమురళి
- బాపట్లలో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - బాపట్ల : జనాభా పెరుగుదలను అదుపు చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. ప్రపంచ జనాభా దినోత్సవం స్థానిక ప్రాంతీయ వైద్యశాల వద్ద గురువారం జరిగింది. జనాభా నియంత్రణపై చేపట్టిన అవగాహన ర్యాలీని బాపట్ల జిల్లా కలెక్టర్, బాపట్ల శాసనసభ్యులు కలిసి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. జనాభా పెరుగుదలలో భారత దేశం అగ్ర భాగాన నిలిచిందని జిల్లా కలెక్టర్ చెప్పారు. మన దేశ జనాభా 138 కోట్లకు చేరడంతో అందుకు సరిపడా వనరులు దేశంలో పెరగలేదన్నారు. యువ శక్తి అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో భారత్ మొదటి స్థాయిలో నిలిచిందన్నారు. జనాభా పెరిగినంతగా జల వనరులు, భూమి, ఆహార ధాన్యాలు, ఇతర వనరులు పెరగలేదన్నారు. ప్రజల ఆలోచనలలోను మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డిసిహెచ్ఎస్ కో- ఆర్డినేటర్ డాక్టర్ శేషుబాబు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.

అందుబాటులో నిత్యావసర ధరలు

- జిల్లాలో ఆరు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు
- కృత్రిమ కొరత సృష్టిస్తే ఉక్కుపాదం
- కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : మధ్య తరగతి ప్రజల సంక్షేమం దృష్ట్యా నిత్యవసర సరుకుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. నిత్యవసర సరుకుల ధరల పెరుగుదలతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి గురువారం ప్రారంభించారు. బాపట్ల రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలోని రైతు బజార్‌ను జిల్లా కలెక్టర్ వెంకట మురళి, శాసనసభ్యులు నరేంద్ర వర్మ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నామని తెలిపారు. మధ్యతరగతి ప్రజల ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రస్థాయిలో మిల్లర్లు ట్రేడర్స్ ను పిలిచి సమావేశమయ్యారని చెప్పారు. నాణ్యమైన కిలో బియ్యం ధర రూ.49లకు, కిలో కందిపప్పు ధర రూ.160 ల చొప్పున విక్రయించాలని సీఎం ఆదేశించడంతో మిల్లర్లు, ట్రేడర్స్ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తక్షణమే అమలులోకి తెచ్చారన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో ఆరు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నాణ్యమైన బియ్యం ధర బయట మార్కెట్లో రూ.60లు ఉండగా కేవలం రూ.49 లకు మాత్రమే విక్రయిస్తున్నామని చెప్పారు. అలాగే నాణ్యమైన కందిపప్పు కిలో ధర బయట మార్కెట్లో రూ.180 ఉండగా, ఇక్కడ మాత్రం రూ.160లకు అందజేస్తున్నామని తెలిపారు. ఆధార్ కార్డ్ చూపి ఎవరైనా ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. మార్కెట్లో ధరలు స్థిరీకరణ అయ్యేవరకు ప్రత్యేక కౌంటర్ లు కొన సాగుతాయన్నారు. తక్కువ ధరలకే నిత్యవసర సరుకులు అందిస్తున్నామని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కౌంటర్‌లు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. అధిక ధరలను నియంత్రించడానికే ప్రభుత్వం బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. నిత్యావసర సరుకులలో ప్రధానమైన బియ్యం, కందిపప్పు ధరలను 10 నుంచి 14 శాతం తగ్గించి ప్రభుత్వం విక్రయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, బాపట్ల ఆర్డీఓ జి రవీందర్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బి.రత్నగుప్తా, కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు తాలూకా అధ్యక్షులు కె.శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్సిడీపై నిత్యవసర వస్తువులు

- త్వరలో ఉచిత గ్యాస్, ఫ్రీ బస్ పథకాలు
- కిలో బియ్యం రూ.49, కందిపప్పు రూ.160 మాత్రమే
- ఈపాటికే ఉచిత ఇసుక, పింఛన్ పెంపు పథకాలను ప్రారంభించాం
- ఒంగోలులో నాలుగు కేంద్రాలు
- ఎమ్మెల్యే దామచర్ల వెల్లడి

విశాలాంధ్ర - ఒంగోలు : నిత్యవసర వస్తువుల ధరలు అందుబాటులో తెచ్చేందుకే సబ్సిడీ నిత్యవసర వస్తువుల కేంద్రాలను ప్రారంభించినట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పేర్కొన్నారు. ఒంగోలులోని లాయర్ పేట సాయిబాబా గుడి పక్కన ఉన్న రైతు బజారులో సబ్సిడీ నిత్యవసర వస్తువుల కేంద్రాన్ని దామచర్ల గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. గ్యాస్ ధరలు, ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెంచారన్నారు. కనీసం పేదలు పండుగ చేసుకునే పరిస్థితి లేక అల్లాడారు అన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల భాగంగా నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన కేవలం నెల రోజుల లోపునే సబ్సిడీ నిత్యవసర వస్తువుల కేంద్రాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. అందులో భాగంగా ఒంగోలులోని లాయర్ పేట రైతు బజార్, దెబ్బల రోడ్డు రైతుబజార్, కొత్త పట్నం బస్టాండ్ రైతు బజార్, డి మార్ట్ సెంటర్లలో సబ్సిడీ నిత్యవసర వస్తువుల కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కేవలం రూ. 160కిలో కందిపప్పు,రూ. 49 కె కిలో స్టీమ్ రైస్,రూ. 48 కే కిలో రా రైస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు దగ్గర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు భాగంగా ఈపాటికే ఉచిత ఇసుక, పెంచిన పింఛన్లను అందజేశారు అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోరూ. 14 లక్షల కోట్లు అప్పులు భాగాలు ఉన్న, రాజధానిని తాకట్టు పెట్టి రూ.37 కోట్లు అప్పు తెచ్చిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చంద్రబాబు నాయుడు సర్వశక్తులను ఒడ్డుతున్నాడు అన్నారు. త్వరలో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం పథకాలను కూడా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కరెంట్ బిల్లులు కూడా తగ్గించి ప్రజలపై భారాలు తగ్గించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఎస్ఓ ఉదయ భాస్కర్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు కోటారి నాగేశ్వరరావు, నాయకులు బందారు మదన్, కుసుమ కుమారి పాల్గొన్నారు.

ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం వద్దు

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. గురువారం ఆమె ఒంగోలు ఆర్.డి.ఓ. కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఎంత మంది పనిచేస్తున్నారు, ఎవరు ఏ సబ్జెక్టు చూస్తున్నారు అని ఆమె ప్రశ్నించారు. వీటికి సంబంధించిన ఫైళ్లను స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. ఆమోదం కోసం తహసీల్దార్ల కార్యాలయాల నుంచి ఎన్ని ఫైల్స్ వచ్చాయి, వాటిలో ఎన్ని ఆమోదించారు. తుది ఆమోదం కోసం కలెక్టరేట్కు ఎన్ని పంపించారు అని ఆమె ప్రశ్నించారు. ఏ ఉద్యోగి ఏ సబ్జెక్టు పరిశీలిస్తున్నారో తెలియ జేసేలా సంబంధిత ఉద్యోగి సీటు వద్ద డిస్ప్లే ఉంచాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని అన్ని గదులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్.డి.ఓ. జి.వి. సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

ఆదర్శ సమాజం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-మార్కాపురం : ఐడియల్ యూత్ మూవెమెంట్ (ఐవైయమ్) మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుండి 14 వరకు ఆదర్శ యువత ఆదర్శ సమాజం అనే నినాదంతో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ స్థానిక ఇస్లామిక్ లైబ్రరీ ఆఫీస్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవైయమ్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ మన భారతదేశంలోని యువత 60 శాతం పైగా ఉన్నారని సమాజ సంస్కరణలో ముందు ఉండాల్సిన యువత నేడు వ్యసనాలకి బానిసలుగా మారుతున్నారని చెడు మార్గాలకు పోయి నేరాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐవైయం సమాజంలో శాంతి సౌభ్రాత్వాలను పెంపొందించడానికి అలాగే యువకులలో మంచి అలవాట్లు పెంచి సమాజ సమగ్రతను కాపాడే పౌరులుగా తయారు చేయడం సంస్థ లక్ష్యమని ఆయన అభిప్రాయపడ్డారు. జెఐహెచ్ జిల్లా అధ్యక్షుల అష్ఫక్ అలీ, జెఐహెచ్ పట్టణ అధ్యక్షులు సికిందర్, ఐవైయమ్ పట్టణ అధ్యక్షులు తలహా,ఐవైయమ్ కార్యకర్తలు రసూల్, మాబు, ఖాదర్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : రాష్ట్ర సచివాలయంలోని మంత్రుల క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి లను గురువారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కలవడం జరిగింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ఆయా గ్రామాలలో పలు అభివృద్ధి పనులను, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయండి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : కౌలు రైతు కార్డులకు దారులకు వెంటనే గుర్తింపు కార్డులు అందజేయాలని తహసీల్దార్ ఎస్కె మీరావలి కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతు కార్డుల దరఖాస్తులపై వ్యవసాయసహాయకులతో అవగాహన సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్ కె మీరావాలి మాట్లాడుతూ గ్రామాలలోని కౌలు రైతులను గుర్తించి వారికి వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇచ్చిన కౌలు రైతు కార్డులు కాల పరిమితి 11 నెలలు గడువుమాత్రమే ఉంటుందని అన్నారు. కౌలు కార్డు జారీలో భూ యజమాని కి కౌలుదారునికి అగ్రిమెంట్ పైన గ్రామ రెవెన్యూ అధికారి సంతకం ఉంటుంది, ముందుగా భూమి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి కౌలు జారుడు దరఖాస్తు చేసుకున్న మూడు రోజుల నే కౌలు కార్డులు ఇవ్వాలని అన్నారు. ఒక కుటుంబంలో ఒక్కరికే కౌలు కార్డు జారీ చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారిని పి పావని మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు పొలంలో వేసిన నమోదు చేయాలని, ప్రభుత్వం నుండి వచ్చు పంట నష్టపరిహారము సబ్సిడీ విత్తనాలు పంటల బీమా బ్యాంకు ద్వారా రుణాలు కౌలు రైతు దారులకు వచ్చే విధముగా చూడాలని తెలియజేశారు. తాము పండించిన పంటను కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవడానికి కూడా కౌలు కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సుబ్బమ్మ సంజీవరావు శ్రీనివాసరావు మౌలావివ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవునిపట్ల భయభక్తులు ఉండాలి

చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ డీపీ యేసయ్య

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పరిశుద్ధ గ్రంథములో తెలియపరచిన అబ్రహాము, నోవాహు, యోబు వంటి భక్తులు దేవుని పట్ల భయభక్తులు కలిగి భక్తి జీవితంతో దీవించబడ్డారని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ డిపి యేసయ్య అన్నారు. సుండి పెంట ఏసుక్రీస్తు రాకడ ధ్వని ప్రార్థన మందిరంలో గురువారం పెద్ద దోర్నాల మండల క్రిస్టియన్ పాస్టర్స్ అండ్ ఇవాంజెలిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ డిపి యేసయ్య మాట్లాడుతూ క్షేమ కాలములో దేవుడు మాట్లాడుతాడని సృష్టిలో మొదటి మానవుడైన ఆదాముతో ఎక్కడున్నావని దేవుడు మాట్లాడాడని, దేవుడు మాట్లాడిన సమయంలో ఆదాము చెట్ల చాటున దాక్కుని ఉండటం గమనించాడని, ఇందులో ఆజ్ఞ అతిక్రమణ అంతరార్థం ఎంతో ఉందని వివరించారు. నయమాను కుష్ఠ రోగాన్ని బాగు చేసిన దైవజనుడైన ఎలీషా శిష్యుడైన గేహాజీ ధనాశ కలిగి నయమాను నుండి ధనం పొంది ఇంట్లో దాచి బయటకు వస్తున్న తరుణంలో ఎక్కడికి వెళ్లావు ఎక్కడనుండి వస్తున్నావు అని అడిగినందుకు నేను ఎక్కడికి వెళ్లలేదు అని అబద్ధమాడి శాపం పొందాడని, ప్రతి మానవుడు భక్తి జీవితము కలిగి శాపం పొందకుండా దైవ దీవెనలు పొందాలని ప్రబోధించారు. ఈ సమావేశానికి పాస్టర్ల సంఘం అధ్యక్షుడు బొప్పూరి ప్రభుదాస్, సువార్తికులు తంగిరాల యాకోబు, దర్శనం. యోహాను, ఎలకపాటి ఆశీర్వాదం, గౌతమి ఎల్లయ్య, శాంతి వర్ధన్, తంగిరాల సురేష్, తాళ్లూరి ప్రభుదాసు, ఊదర దేవిడ్, సింగ ఏసు, సింగ సురేష్, చాట్ల విజయ్, సురేష్, ఆనంద్, వినోద్, మాంధ్ల వెంకటేశ్వర్లు (యోహాను) సువార్త గాయకులు దేవిడ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

16న రాష్ట్రస్థాయి బండలాగుడు ఎడ్ల పోటీలు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో వేంచేసియున్న హజరత్ కాసిం స్వాముల మొహరం పండుగ సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన రాష్ట్రస్థాయి రెండు పండ్ల విభాగానికి చెందిన ఎడ్లతో బండలాగుడు పందాలను ఏర్పాటు చేశారు. ఇందుకుగా మొత్తం ఆరు నగదు బహుమతులను ఏర్పాటు చేశారు, మొదటి బహుమతి 25 వేల రూపాయలు, రెండవ బహుమతి 20 వేల రూపాయలు, మూడవ బహుమతి 15 వేల రూపాయలు, నాలుగో బహుమతి పదివేల రూపాయలు, ఐదవ బహుమతి 5000 రూపాయలు, ఆరో బహుమతి మూడు వేల రూపాయలగా ప్రకటించడం జరిగింది. ఆసక్తి గలవారు వెంటనే 500 రూపాయలను ఎంట్రీ ఫీజులు చెల్లించి రసీదు పొందాలని కోరారు. సంప్రదించవలసిన వారి చిరునామా, వెన్నా చిన్న సత్యనారాయణరెడ్డి,సెల్ నెంబర్లు 9440791698, 9912261298. తుది నిర్ణయం కమిటీ సభ్యులదే నని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నీటి సంరక్షణకు రైతులు కృషి చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : భూగర్భ జలాల సంరక్షణకు పచ్చదనం పెంపునకు రైతులు తమ వంతు కృషి చేయాలని మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ అండ్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ డైరెక్టర్ దేవి దత్త శాతపతి అన్నారు. మండలంలోని పూరిమిట్లగ్రామంలో ఒక లక్ష అయిదు వేల రూపాయలతో నిర్మించిన సేద్యపు నీటి కుంటను గురువారం కేంద్ర బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల సరిహద్దుల్లో కందకాలు తవ్వుకోవాలన్నారు. పొలాల గట్ల వెంట మొక్కలు నాటుకోవాలని అన్నారు. వర్షాకాలంలో పండ్ల మొక్కలు పెంచుకోవాలని అన్నారు. జల శక్తి అభియాన్ మరియు భూగర్భ జల శాస్త్రవేత్త సంతోష్ గౌతమ్ మాట్లాడుతూ గ్రామంలో రోడ్ల వెంట ఇరువైపుల మొక్కలు నాటాలని అన్నారు. పొలాల్లో ఫారం పాండ్లు తవ్వుకోవాలని అన్నారు. పొలాల్లో అక్కడక్కడ చిన్న చిన్న చెరువులు కుంటలు నిర్మించుకొని వర్షపు నీటిని నిలువ చేసుకున్నట్లయితే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి అర్జునరావు, ఏపీ డి నిర్మల, ఏపీవో ఎం అండ్ ఇ కే మధుసూదన్ రావు, ఎంపీడీవో బి జనార్ధన్ రావు, ఈవో పి ఆర్ డి శ్రీదేవి, ఏపీవో కే నాగరాజు, ఈసీ శివరామకృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని తహసీల్దార్ కార్యాలయం నందు పంట సాగు హక్కు పత్రం సీసీఆర్‌సీపై గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహనా కార్యక్రమంను గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ఎం హమ్మద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కార్డ్స్ గురించి రైతులకు అవగాహనా కల్పించి, ఎస్సీ ఎస్టీ, సన్న, చిన్న కారు రైతులను గుర్తించి సీసీఆర్సీ కార్డ్స్‌ను మంజూరు చేయాలనీ చెప్పడము జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డ్స్ వలన ఉపయోగాలు పంట రుణాలు, విత్తనాలు, పంటల భీమా పథకం, ఇన్పుట్ సబ్సిడీ, ఈ పంట నమోదు కొరకు రైతులకు ఉపయోగం ఉంటుందని చెప్పడము జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగేశ్వరరావు, వీఆర్వోలు లు గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యన సహాయకులు, పట్టు సహాయకులు పాల్గొనడం జరిగింది.

తూనికల కొలతల అధికారుల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలోని పలు దుకాణాలను గురువారం తూనికల కొలతల అధికారి రియాజ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మూడు దుకాణాలపై కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న వ్యాపారస్తులు మధ్యాహ్నం నుంచి దుకాణాలను మూసివేశారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా గాడి మహేంద్ర

నియామక పత్రం అందచేసిన జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్

విశాలాంధ్ర-పామూరు : సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రకాశం జిల్లా చైర్మన్‌గా పామూరుకు చెందిన గాడి మహేంద్రను నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ అధికారికంగా నియమించారు. గురువారం అబిడ్స్‌లోని హెూటల్ రీగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవ హక్కుల పరిర్షణకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వానికి, పాలక వర్గానికి, పోలీసులకు తాము సహకారంగా ఉంటామని తెలిపారు. రాజ్యాంగము కల్పించిన హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే జాతీయ మానవ హక్కుల కమిషన్ లో కేసు ఫైల్ చేసి నిజమైన భాదితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. జిల్లా చైర్మన్ గా మహేంద్ర బాధ్యత గా పని చేసి, భాదితులకు, ప్రజలకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మహేంద్ర మాట్లాడుతూ తన నియామకానికి సహకారం అందించిన నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనో హర్‌కి, సౌత్ ఇండియా చైర్మన్ హన్మ గౌడ్‌కి, తెలంగాణా రాష్ట్ర చైర్మన్ నోముల సంపత్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ బాలాజీ గారికి ధన్యవాదములు తెలిపారు. నాకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతగా నిర్వహిస్తానని, భారత రాజ్యాంగానికి, చట్టానికి కట్టుబడి పని చేస్తానని ప్రమాణం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం చైర్పర్సన్ పి.రాజేశ్వరి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నవీన్ కుమార్, తెలంగాణా రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ బి. సుధాకర్, సిరిసిల్ల జిల్లా చైర్మన్ గాజుల వేణు కుమార్, నిజామాబాద్ జిల్లా ప్రెసిడెంట్ కొప్పు రాజేందర్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుర్బిర్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఔదార్యంతో పాఠశాలకు బీరువా బహూకరణ

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగుల విద్యార్థులు వారి తల్లిదండ్రులు సహకారంతో పాఠశాలకు సుమారు రూ.10 వేలు విలువ చేసే ఇనుప బీరువాను బహూకరించారు. గురువారం పాఠశాలలో జరిగిన దివ్యాంగుల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ప్రధానోపాధ్యాయులు వేముల పిచ్చి రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి పి.ఆంజనేయులు మాట్లాడుతూ దివ్యాంగుల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబులు, పరికరాలు, ఇతర వస్తువులు దాచుకోడానికి తల్లిదండ్రులు ఎంతో మంచి మనస్సుతో ఇస్తున్న బీరువా ఎంతో ఉపయోగపడుతుందని వారిని కొనియాడారు. వీరికి చదువు చెప్పే టీచర్లుతో పాటు ఉపకార వేతనాలు, ఎస్కార్ట్, రవాణా అలివేన్సులు, వివిధ రకాల పథకాలు గురించి వివరించడం జరిగింది. అమ్మకు వందనం లాంటి పథకాలకు హాజరు మినహాయింపు కూడా వీరికి ఉంటుందని ఆయన తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి2 మల్లు నాయక్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో ఈ విద్యార్థులకు మినహాయింపు ఉంటుందని వివరించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుల వారు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుండి 14 సంవత్సరాలు లోపు ఉన్న విద్యార్థిని విద్యార్థులందరూ పాఠశాలలో ఉండాలని, అలానే మిగతా విద్యార్థులతో పాటు దివ్యాంగు విద్యార్థులు కూడా సమానంగా చదువుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల విద్యార్థుల యొక్క తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ ఎడ్యుకేటర్ షేక్ సాదిక్ ఉపాధ్యాయులు నాగరాణి, శేష రావు, నందగోపాల్, యోగా నాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుంటుపల్లి సుబ్బరామయ్యకు దద్దాల నారాయణ యాదవ్ పరామర్శ

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని నర్ర మారెళ్ళ గ్రామానికి చెందిన గుంటుపల్లి సుబ్బరామయ్య ఇటీవల గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని తమ నివాస గృహంలో విశ్రాంతి పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి కనిగిరి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ గురువారం నరమారెళ్ల గ్రామానికి వెళ్లి సుబ్బరామయ్యను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి చెంచురెడ్డిపల్లెలో విశ్రాంతి తీసుకుంటున్న బాస్ వెంకటేశ్వర్లును పరామర్శించి

ఆరోగ్య పరిస్థితులను నారాయణ యాదవ్ అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, వైస్ ఎంపీపీ గంధం ఏసు రత్నం, ఎంసి వైస్ చైర్మన్ చాంద్ బాషా, గట్ల విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య,, పామూరు టౌన్ సచివాలయం కన్వీనర్ గయాజ్, కనిగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, సైకం ఏడుకొండలురెడ్డి, గొబ్బెల్ల శ్రీను, వెంకటేశ్వర రెడ్డి, చిన్న పెద్దయ్య, సామేలు, దావీదు, జాన్, కమతం రమణారెడ్డి పాల్గొన్నారు.

గంటా పెద్ద కొండయ్యకు ఘననివాళి

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని అప్ప మాంబాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గంట రమణయ్య తండ్రి గంట పెదకొండయ్య దశదిన కర్మ గురువారం జరిగింది. కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్, మండల వైసీపీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి లు పాల్గొని పెద కొండయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, ఏఎంసి వైస్ చైర్మన్ చాంద్ బాషా, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, గట్ల విజయభాస్కర్ రెడ్డి, గంధం భాస్కర్, ఎలుక అచ్చయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, వెంకట నారాయణ, మాల్యాద్రి, వెంకట్ రెడ్డి, బాలకృష్ణ, కనిగిరి నియోజకవర్గ ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, నాయకులు సైకం ఏడుకొండలు రెడ్డి, గొబ్బెల్ల శ్రీను, వెంకటేశ్వర శ్రీహరి రెడ్డి, సిద్ధారెడ్డి, కమతం రమణారెడ్డి డప్పు కొట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరండంపై అవగాహన, బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-కనిగిరి : హెల్మెట్ ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి కె. భరత్ చంద్ర ఆధ్వర్యంలో గురువారం కనిగిరి పట్టణంలో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కనిగిరి కోర్టు నుండి ఆర్టిసి డిపో, ప్రధాన కూడళ్లలో 70 ద్విచక్రవాహనాలతో బైక్ ర్యాలీ సాగి ద్విచక్ర వాహనదారులు, పిలియన్ రైడర్లు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు.ర్యాలీలో 70 మోటార్ సైకిళ్లలో 50కి పైగా పిలియన్ రైడర్లు పాల్గొన్నారు.ఈసందర్భంగా న్యాయమూర్తి కె.భరత్ చంద్ర మాట్లాడుతూ రైడర్లు మాత్రమే కాకుండా పిలియన్ రైడర్లు కూడా హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం ర్యాలీ యొక్క ప్రధాన లక్ష్యం అని అన్నారు. మోటార్ వాహనదారులు హెల్మెట్ ధరించుకొని ప్రాణాలు కాపాడుకోవాలని, హెల్మెట్ భారం కాదని అది మన బాధ్యత అని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డు భద్రతా నిబంధనలను పాటించనివారిపై రూ.1000 జరిమానా విధించడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి లైసెన్స్ కూడా రద్దు చేయబడుతుంది అని అన్నారు.కార్యక్రమంలో పోలీస్ సిఐతో పాటు పోలీస్ సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు కోర్టు సిబ్బంది, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది,న్యాయవాదుల గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో అసైన్మెంట్ భూములను పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలో ఉన్న అసైన్మెంట్ భూములను గురువారం జెసి రోణంకి గోపాలకృష్ణ పరిశీలించారు. కనిగిరి పట్టణంలోని మాచవరం, కంభం రోడ్డు, పొదిలి రోడ్డు, ఏబీఆర్ కళాశాల వైపు ఉన్న ఆక్రమణలో ఉన్న అసైన్మెంట్ భూములను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కనిగిరిలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అసైన్మెంట్ భూములను ప్లాట్లుగా వేసి విక్రయించడం జరిగింది. ఈ విషయంపై పూర్తిస్థాయిలో అధికారులతో చేసి మాట్లాడారు. అసైన్మెంట్ భూములు ఆక్రమించిన, క్రయవిక్రయాలు జరిగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్, కమిషనర్ టీవీ రంగారావు, తాహసిల్దార్, వీఆర్వోలు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన లక్ష్మి

విశాలాంధ్ర-దర్శి : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని దర్శి తెలుగుదేశం జనసేన బిజెపి కూటమినేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వెలగపూడి లోని ఏపీ సచివాలయంలో గురువారం మంత్రి చాంబర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనుభవజ్ఞులు, సీనియర్ నాయకులు పయ్యావుల ఆర్థిక మంత్రిగా ఆంధ్ర రాష్ట్ర పురోభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అభినందించారు. దర్శి నియోజకవర్గంలో అభివృద్ధికి సహకారాన్ని అందించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి ఒక సోదరిగా డాక్టర్ లక్ష్మి ప్రజల కోసం తనను ఎప్పుడైనా కలవచ్చని తెలిపారు. ఆర్థిక మంత్రితో గొట్టిపాటి లక్ష్మి భేటీ దర్శి అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య అందిస్తున్నట్లు ఎంఈఓ జాలపాటి సుబ్బారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల మెయిన్ పాఠశాల నందు నేను బడికి పోతా విద్యా ప్రవేశంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తగిన మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కే శారద. సిహెచ్ పద్మావతి, ఉపాధ్యాయుడు ఎన్ రాఘవ, ఉపాధ్యాయిని లలిత కిరణ్, ఎస్ కోటేశ్వరరావు, ఎం నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి పట్టణంలోని పాతూరులో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం పలువురిని పరామర్శించారు. పదవి విరమణ చేసిన ఎంపీడీవో చీమలమర్రి ప్రసాద్ రావు ఆరోగ్యంపై ఆరా తీశారు. టిడిపి సీనియర్ కార్యకర్త షేక్ మీరాబిని పరామర్శించి ఆమె యోగక్షేమల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జకరయ్య, లక్ష్మయ్య, పఠాన్ కరీం ఇతర నాయకులు పాల్గొన్నారు.

చిన్న కుటుంబం చింతలేని కుటుంబం

విశాలాంధ్ర-కనిగిరి : ప్రపంచ జనాభా దినోత్సవంను పురస్కరించుకొని కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో గల కాశిరెడ్డి కాలనిలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సృజన నేతృత్వంలో వైద్య ఆరోగ్య శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీని ఐక్యరాజ్యసమితి వారి ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా జనాభా దినోత్సవం నిర్వహించుచున్నారని దీని యొక్క ముఖ్య ఉద్దేశం ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న జనాభాను నియంత్రించేందుకు, స్త్రీ పురుషుల మధ్య సమానత్వం, మానవ హక్కులు, బాల్యవివాహాలు,. కుటుంబ సంక్షేమం, అధిక జనాభా వల్ల కలిగే నష్టాలు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించినప్పుడే ఈ అధిక జనాభా వల్ల కలిగే సమస్యల పట్ల అవగాహన పెంచుకొనవచ్చునని కావున ప్రతిఒక్కరు కుల, మతాలకతీతంగా, జనాభాను నియంత్రించుటకు కుటుంబనియంత్రణ పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయం ఎ ఎన్ యం లక్ష్మి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి.నవ కుమార్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హవా

విశాలాంధ్ర-పీసీపల్లి : ట్రిబుల్ ఐటీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. పీసీపల్లి మండలం నుండి 21 మంది ట్రిబుల్ ఐటీకి అర్హత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారులు సంజీవి శ్రీనివాసులు తెలిపారు. పెదచెర్లోపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 07 గుంటుపల్లి పాఠశాల నుండి 04 పెద ఇర్లపాడు పాఠశాల నుండి 03 కేజీబీవీ నుండి 03 నేరేడుపల్లి పాఠశాల నుండి 02 మురుగమ్మి పాఠశాల నుండి 01 పెద అలవలపాడు పాఠశాల నుండి 01 తో కలుపుకొని 21 మంది ట్రిబుల్ ఐటీలలో ప్రవేశాలకు అర్హత సాధించినట్లు తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి విద్యార్థినీ విద్యార్థుల పట్టుదల అభినందనీయమని కొనియాడారు. అనంతరం అర్హత సాధించిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ ఉపాధ్యాయిని సిబ్బంది అభినందించారు.

దాతల సహకారం అభినందనీయం

విశాలాంధ్ర-పీసీపల్లి : గ్రామీణ విద్యార్థులకు విద్యాభివృద్ధిలో తోడ్పాటును అందించే దిశగా కృషి చేయడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారులు సంజీవి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతగుంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అంతే కాకుండా మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులకు ప్రముఖ బిల్డర్ పోలిశెట్టి చౌదయ్య విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు బహుకరించటం ఎంతో గొప్ప విషయమన్నారు. సామాజిక సేవలో భాగంగా ఇలాంటి వారు ముందుకు వచ్చి విద్యార్థులకు చేయూతను అందించడం వారికి వరంలాంటిదన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి టీడీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-పామూరు :
టిడిపి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ చౌదరి అన్నారు. గురువారం మండలంలోని బొట్లగూడూరు రైతు సేవ కేంద్రంలో 30 శాతం సబ్సిడీతో కందులను రైతులకు పంపిణీ కార్యక్రమాన్ని ప్రభాకర్ చౌదరి ప్రారంభించారు. మాట్లాడుతూ రైతులకు సకాలములో విత్తనాలను పంపిణీ చేయడం, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కనిపించడం, పంటలకు బీమా కల్పించడం లాంటి పథకాలతో రైతులకు ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ కోటపాటి వెంకటేశ్వర్లు, పామూరు మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు రాయవరపు శ్రీకాంత్, కోటపాటి రాజా, గూడూరు వెంకటాద్రి, అగ్రికల్చర్ అసిస్టెంట్ హరికృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పార్దు, డిజిటల్ అసిస్టెంట్ మల్లికార్జున, బొట్లగూడూరు పంచాయతీ రైతులు పాల్గొన్నారు.

పళ్ళతోటల పెంపకంపై అవగాహన

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామంలో రచ్చబండ వద్ద గ్రామ పెద్దలు ఉపాధి కూలీలు మరియు మేట్స్‌కు పండ్ల తోటల పెంపకం గురించి అవగాహనా కార్యక్రమం జరిగినది. దీనిలో భాగంగా మామిడి సపోటా దానిమ్మ జామ డ్రాగన్ ఫ్రూట్ బత్తాయి మునగ మొ "నవి ఉపాధి హామీ పథకం ద్వారా ఇవ్వబడును దీనితో పాటు క్రాప్ వారీగా మైంటెన్స్ 3ఇయర్స్ ఇవ్వబడును అని ఏపీవో మాచర్ల తెలియజేశారు. ఇద్దరు రైతులు కూడా ముందుకు రావడం జరిగింది. దీని మీద టామ్ టామ్ కూడా అన్ని పంచాయితీలలో వేయించడం జరిగింది. చిన్న సన్నకారు రైతులు ఎవరు ఉన్న 5 ఎకరాల లోపు వారు దీనికి అర్హులు అని తెలియజేసారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో 'శ్రీసాధన' విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ :
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గురువారం మధ్యాహ్నం విడుదల చేసిన డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాల విద్యార్థులు 92 శాతం సగటు ఉత్తీర్ణతతో అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తెలిపారు. బి.యస్సీ బి.జడ్.సి విభాగంలో కె.లక్ష్మీచైతన్య 1000లకు 934 మార్కులు సాధించగా, బి.యస్సీ యమ్.పి.సి.యస్ విభాగంలో ఇ నాగస్వేత 900 లకు 837., బి.యస్సీ యమ్.యస్.సి.యస్ విభాగంలో షేక్ సజన 900లకు 836, అదేవిధంగా బి.కామ్ కంప్యూటర్ విభాగంలో సి. హెచ్ గౌరీ తనూజ 800 లకు 676, బి.యస్సీ యం.పి.సి. విభాగంలో వై వెంకట శివ సాయి కుమార్ 900 లకు 627, బి.కామ్ జనరల్ విభాగంలో షేక్ దిల్షాద్ 700 లకు 565, మార్కులు సాధించారని, గణితంలో నలుగురు విద్యార్థులు శతశాతం మార్కులు సాధించగా వివిధ సబ్జెక్టులలోని 228 పేపర్లలో 90కి పైగా మార్కులు సాధించారని డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అన్నారు. ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తోపాటు సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డి రాజగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు వి.ఆర్.కె ప్రసాద్, ఎం.వి కృష్ణారెడ్డి, డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి, జి.యల్ రమేష్ బాబులతో పాటు వైస్ ప్రిన్సిపల్ పి. శ్రీధర్ కుమార్, ఫ్లేస్ మెంట్సెల్, సాక్, అకడమిక్ కో-ఆర్డినేటర్లు కె. పవన్ కుమార్, డాక్టర్ ఎం. శేషకుమార్, డాక్టర్ పి. రామకృష్ణప్రసాద్, సిబ్బంది అభినందించారు.

రాయితీపై కందిపప్పు, బియ్యం పంపిణీ ప్రారంభం

విశాలాంధ్ర-పర్చూరు: ప్రజా కూటమి ప్రభుత్వం పేద ప్రజల కొరకు కందిపప్పు, బియ్యం రాయితీపై పంపిణీని గురువారం పర్చూరులో ప్రారంభమయింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు కందిపప్పు కేజీ రూ.160, స్టీమ్ టీపీటీ బియ్యం కేజీ రూ.49, పచ్చి బీపీటీ బియ్యం కేజీ రూ.45కే అందుబాటులో ఉండేవిధంగా ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. కార్యక్రమంలో టీడీపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోడూరి శేషబ్రహ్మాచారి, పౌరసరఫరాల డీటీ అనిత, తదితరులు ఉన్నారు.

బడి ఈడు పిల్లలందరు పాఠశాలలో ఉండాలి

విశాలాంధ్ర-పర్చూరు: బడిఈడు పిల్లలందరు పాఠశాలలో ఉండాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి(డీసీఎంఓ) శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇందిరా కాలనీలోని ప్రాధమిక పాఠశాలను గురువారం అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని అన్నారు. ఐదు ఏళ్ళ పైబడిన వయస్సుగల 11 మంది పిల్లలను బడిలో చేర్పించి విద్యార్థులకు కిట్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ సమన్వయకర్త సత్యసాగర్, ఎంఈఓ-2 వెంకటరామయ్య, ఎన్యుమరేటర్లు ఉమామహేశ్వరరావు, సాయికుమార్, కోటేశ్వరరావు, సామ్రాజ్యలక్ష్మి, హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు చింపారెడ్డి ఉన్నారు.

నిత్యావసరాల విక్రయ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె పట్టణ ప్రజలకు తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు, నిత్యవసరాలు విక్రయించేలా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేపల్లె పట్టణంలోనీ నిజాంపట్నం రోడ్‌లో నూతనంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ రైతు బజారు సంస్థ గత రిటైల్ దుకాణాలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రవీంద్రబాబు, టీడీపీ నాయకులు పంతాన్ని మురళీధర్ రావు, ధర్మ తేజ ,టీ ఏడుకొండలు, రవిశంకర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రిటైల్ దుకాణాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం

విద్యుత్తు ఈఈ వివి చిరంజీవి

విశాలాంధ్ర - వేమూరు : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, హెచ్చుతగ్గులు లేని నిరంతర విద్యుత్ అందించేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం కృషి చేయాలని విద్యుత్ శాఖ ఈఈ వివి చిరంజీవి తెలిపారు. మంగళవారం వేమూరులో తమ సిబ్బందితో కలిసి విద్యుత్ మీటర్లు, విద్యుత్తు లైన్లు తనికి నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ గణపతి కళ్యాణ మండపంలో విద్యుత్ శాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖ పని తీరుపై సమీక్షించడం జరిగిందని రాష్ట్ర ప్రజలకు నిరంతర విద్యుత్ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు.సీఎం చంద్రబాబు నాయుడుకు విద్యుత్‌శాఖపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారని, ఆ మేరకు ప్రజలకు విద్యుత్ అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది మీ పరిధి గ్రామాల్లో విద్యుత్తు లైన్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ అంతరాయం లేని విద్యుత్ అందించే విధంగా చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ ఏడిఏలు కే.రాజశేఖర్, అశోక్ కుమార్, ఏఈలు, ఎల్ఐలు, లైన్‌మెన్‌లు, సిబ్బంది ఉన్నారు.

నిధులు విడుదలలో జాప్యం

- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

- మీడియాతో ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి

విశాలాంధ్ర - రేపల్లె : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ గత ఏడాది కాలంగా గ్రామ పంచాయతీలకు ,మండల జిల్లా పరిషత్తులకు చెల్లించవలసిన నిధులు విడుదల చేయక పోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతున్నదని రేపల్లె ఎంపీడీవో శ్రీనివాసుల రెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు రావలసిన 50 శాతం నిధులు మండల పరిషత్తుకు 25 శాతం, జిల్లా పరిషత్ కు 25 శాతం నిధులు గత ఏడాదిగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ విడుదల చేయకపోవడంతో గ్రామాలలో జరగవలసిన అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుబడి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేకపోతున్నామని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీలకు మండల జిల్లా పరిషత్లకు నూరు శాతం నిధులు స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నుండి కోట్లాది రూపాయలు గ్రాంట్ నిలిచిపోవడంతో గ్రామాల అభివృద్ధి ప్రశ్నార్ధకంగా మారిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు రెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ శాఖ ద్వారా విడుదల కావలసిన నిధులు ఈ ఆర్థిక సంవత్సరంలో నైనా విడుదల అయితే గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు ఇతర సంక్షేమ పనులు చేపట్టవలసిన పనులు, అదేవిధంగా మండల పరిషత్ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులు కూడా చేపట్టడానికి అవకాశం ఉంటుందని ఎంపీడీవో తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ శాఖ ఉన్నతాధికారులు నిధులు విడుదల చేయించే విషయంలో చొరవ తీసుకుంటే బావుంటుందని అభిప్రాయాన్ని ఎంపీడీవో వ్యక్తం చేశారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి

- ఎంఈవో చెరుకూరు గోపి

విశాలాంధ్ర - యద్దనపూడి : నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ చెరుకురు గోపి అన్నారు. యద్దనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యద్దనపూడి లో వలేరు సామ్యూల్ , మున్నంగి మహేష్ అను ఇద్దరు విద్యార్థులను 8వ తరగతిలో మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో చేర్చుకోవడం జరిగింది.ఈ సందర్భంగ ఎంఈఓ మాట్లాడుతూ బడిబయట విద్యార్థులు లేకుండా చూడాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. 6 -14 సంవత్సరాల మధ్య వయసు ఉన్న విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్చాలని,చదువు వలననే జీవితాలు మారుతాయని విజ్ఞానం పెరుగుతుందని మంచి ఉపాధి లభిస్తుందన్నారు. చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా సంవత్సరానికి 15 వేలు అంద జేస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠ శాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.పాఠశాలలో చేర్చిన ఇద్దరు విద్యార్థులకు వెంటనే స్టూడెంట్ కిట్‌లను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు యం. దేవేంద్రరావు, రావి శ్రీనివాస రావు,సిఆర్పిలు యూసఫ్ , ప్రేమ్ కుమార్, మస్తాన్ వలి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర - రేపల్లె : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరుకోవాలని రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ పరిధిలోని పారా లీగల్ వాలంటీర్లు ఆర్ శ్రీనివాసరావు, సిహెచ్ నాగమల్లేశ్వరరావు, సయ్యద్ అహ్మద్ లు వాహన చోదకులకు విజ్ఞప్తి చేశారు. గురువారం రేపల్లె పట్టణంలోని నిజాంపట్నం రోడ్‌లో రామశాస్త్రి కళ్యాణమండపం ప్రాంతంలో వాహన చోదకులకు న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. రేపల్లి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు వాహన చోదకులకు హెల్మెట్ వలన కలిగే ఉపయోగాలు పెట్టుకోకపోవడం వల్ల కలిగే అనర్ధాలు గురించి ఉచిత న్యాయ విజ్ఞాన కార్యక్రమాన్ని అవగాహన ద్వారా క్షుణ్ణంగా వివరించారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని వారు కోరారు. భద్రత మార్గదర్శకాలను కూడా తప్పనిసరిగా పాటించాలన్నారు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ,రోడ్డు ప్రమాదాల నివారణలో వాహన శోధకులు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. హెల్మెట్ ధరించండి సురక్షితంగా గమ్యస్థానాలు చేరండి అంటూ నినాదాల ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు ఆర్ శ్రీనివాసరావు, సిహెచ్ నాగమల్లేశ్వరరావు, సయ్యద్ అహ్మద్, రేపల్లె మండలం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సమైక్య కన్వీనర్ కలిచేటి శ్రీనివాసరావు, ఆర్టీసీ కండక్టర్లు ,డ్రైవర్లు వాహన చోదకులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి దాతృత్వం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని నల్లమడుగుల ఎంపీపీఎస్ డిపెప్ పాఠశాలకు పూర్వ విద్యార్థి పత్తురి నాగిరెడ్డి కుమారుడు మనోజ్ కుమార్ మూడు రాక్‌లు మరియు విద్యార్థుల కోసం నోట్ పుస్తకాలు బహుకరించారు. ప్రధానో పాధ్యాయులు హమ్మద్ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయురాలు అనూరాధ విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర బాపట్ల : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కొరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంపై సంబంధిత విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో గురువారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. భావి భారత పౌరుల కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా అమలు జరగాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలోని మెనూ అమలు తీరుపై ప్రతిరోజు అధికారులు తనిఖీలు చేయాలన్నారు. పిల్లలకు ఐదు రోజులపాటు కోడిగుడ్లు ఇవ్వాల్సిందేనన్నారు. మూడు రోజులు రాగిజావ, మరో మూడు రోజులు చిక్కీలు ఇవ్వాలన్నారు. అధికారులు పాఠశాలలను విధిగా తనిఖీలు చేసి నివేదిక పంపాలని ఆదేశించారు.

ఏ పాఠశాలలోనైనా మెనూ అమలు జరగడంలేదని ఫిర్యాదులు వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి ఎం వెంకట సుధాకర్ బాబు, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

- బాపట్లలో జెండా ఎగరవేసిన సీనియర్ కామ్రేడ్ వి.ఆర్ ప్రసాద్

- ముఖ్య అతిథులుగా హాజరైన బిటి వలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఆర్టీసి గ్యారేజ్ ఎంప్లాయిస్ యూనియన్ 73 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆర్టీసి గ్యారేజ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వైఎస్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. గురువారం బాపట్ల కొత్త బస్ స్టాండ్ వద్ద ట్రాఫిక్ కంట్రోలర్ సీనియర్ కామ్రేడ్ విఆర్ ప్రసాద్ యూనియన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ మహిళా కండక్టర్ జీవన్ కుమారి కేక్ కట్ చేశారు. అదేవిధంగా ఆర్టిసి గ్యారేజ్‌ల వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్ర మంలో సీనియర్ కామ్రేడ్ వివిల్ నారాయణ జెండా ఆవిష్కరించగా సీనియర్ కామ్రేడ్ రాజేశ్వరరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు బి.టి వలి,డిపో నాయ కులు నరసింహారావు చలపతి లు ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడా రు. జిల్లా కార్యదర్శి వైఎస్‌రావు మా ట్లాడుతూ గత 72 సంవత్సరాల నుండి ఒక ప్రక్క సంస్థ అభివృద్ధి ఇంకొక ప్రక్క కార్మికుల ప్రయోజ నాలను కాపాడేందుకు ముందుండి ఒంటరిగాను అవసరమైన చోట సమైక్య ఉద్యమాలు నిర్మించి కార్మిక ప్రయోజనాలు కాపాడిందన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ఈరోజు ఆర్టీసీ ఉద్యోగులు అనుభవిస్తున్న 80 శాతం ప్రయోజనాలు ఒక్క ఎంప్లా యిస్ యూనియన్ మాత్రమే సాధించిందన్నారు. సమైక్యాంధ్ర ఉద్య మం జరుగుతున్న సమయంలో ఎంప్లాయిస్ యూనియన్ ముందుండి ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడింద న్నారు. రాష్ట్ర విభజన తరువాత కాలంలో కూడా ప్రభుత్వంలో విలీనం అనంతరం ఏర్పడిన సమస్యలు ఏపీ జెఎసి అమరావతిలో భాగంగా మారి ఆర్టీసీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి అన్ని సమస్యలు పరిష్క రించే ప్రయత్నాలు ఎప్పటికప్పుడు చేస్తూ ఎల్ల వేళలా అందుబాటులో ఉండి సహకరిస్తున్న నాయకులకు సభ్యులకు ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర -కర్లపాలెం : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని పేం లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు కిట్లను వేగేశన పలువురుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసు కుంటుందని అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేగేశన, బాలకృష్ణమూర్తిలను పాఠశాల యాజమాన్యం పూలమాలలు దృశాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏపూరి భూపతిరావు, మద్దిబోయిన బుల్లియ్య, రాజు మాస్టారు తదితరులున్నారు.

డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి గడువు పొడిగింపు

రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్ర కుమార్

విశాలాంధ్ర - రేపల్లె : 2024 - 25 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరం చేరబోయే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గడువును ఈనెల 20 తేది వరకు ప్రభుత్వం పొడిగించినట్లు రేపల్లె ఏబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్ర కుమార్ గురువారం తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ప్రిన్సిపాల్ కోరారు.

అవోపాలో కంప్యూటర్ శిక్షణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల అవోపాలో ట్యాలీ కోర్సు ప్రారంభముతుందని ఆసక్తి కలవారు వినియోగించుకోవాలని అధ్యక్షుడు వలివేటి మురళీ కృష్ణ అన్నారు. ఈ కోర్సు ఆరు వారాలు, వారానికి ఆరు రోజులు, రోజుకి ఒక గంట, సాయంత్రం 5.30 నుండి 6.30 వరకు జరుగు తుందని 20 మందికి మాత్రమే అవకాశం ఉన్నట్లు తెలిపారు. వివరాలు కోసం 9848242835, 9959598182 నంబరులకు ఫోను చేసి పేరు నమోదు చేసుకో వాలన్నారు. మురళీ కృష్ణ, ఏకాంబ రేశ్వర బాబు, వెంకటరామయ్య, మొహిద్దీన్ పాల్గొన్నారు.

అన్నదానం ప్రారంభం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణానికి చెందిన కీ. శే సాగన బోయిన రాములు 9వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు సాగనబోయిన రమేష్, చిన్న రోషయ్య కుటుంబ సభ్యులు పట్ట ణంలోని సాయిబాబా మందిరంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారికీ రాములు కుటుంబ సభ్యులు పూలమాల శాలువా వేసి ఘనంగా సన్మానించారు. దప్పిలి భాస్కర్‌రెడ్డి, పాలుగుళ్ళ ప్రతాప్ రెడ్డి, కాపు నాయకులు దుత్తాబాల ఈశ్వరయ్య, నారాయణ, పగడాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేశంలో జనాభా నియంత్రణ అవసరం

వైద్యాధికారి డాక్టర్ చంద్రిక

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : దేశంలో జనాభా నియంత్రణ చాలా అవసరమని, జనాభా పెరగడం వలన చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రిక అన్నారు.ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవ గాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా పెరుగుట వలన నిరుద్యోగ సమస్య, భూ సమస్యలు, ఆహార సమస్య, నీటి సమస్య, ధరలు పెరుగుట ఇవన్నీ కూడా ఉత్పన్నమవుతాయి అన్నారు. జనాభా నియంత్రణకు ప్రస్తుత కాలంలో పురుషులకు వ్యాసెక్టమీ ఆపరేషన్, మహిళలకు ట్యూబెక్టమి లాప్రో స్కోపిక్ ఆపరేషన్ అందుబాటులో ఉన్నాయన్నారు.మనం ఇద్దరూ మనకి ఇద్దరూ సంతానం ఉంటే సంసారం కూడా చాలా చక్కగా ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు.వివాహాలు తప్పనిసరిగా ఆడవారికి 18 సం, మగవారికి 21 సం, తప్పనిసరిగా ఉండాలని చట్టం చెబుతుందన్నారు. సంతానంలో మెలకువలు పాటించి బిడ్డ బిడ్డకు వ్యవధి మూడు సంవత్సరాలు ఉండేలా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నరసింహారావు, సిబ్బంది హసన్ జానీ, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పీలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, కళాశాల విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

కుటుంబ సంక్షేమమే దేశ సౌభాగ్యం

- పీహెచ్‌సీ వైద్యులు పి.హర్ష

విశాలాంధ్ర - యద్దనపూడి : కుటుంబ సంక్షేమమే దేశ సౌభాగ్యమని వైద్యాధికారి డాక్టర్ పి హర్ష అన్నారు.ప్రపంచ జనాభా దినోత్సవం సంద ర్భంగా యద్దనపూడి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని, కాన్పుకాన్పుకు మధ్య ఎడం ఉండాలని, బాల్య వివాహాలు చేసుకోరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ టీవీఎస్ ప్రసాద్, సూపర్వైజర్లు యన్ నాగేశ్వరరావు, బి సునంద, రారాజు చంద్రశేఖర్,విమల ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు గురుకుల పాఠశాల , విద్యార్థులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర - బాపట్ల : మోటారు వెహికల్ రాకపోకలు సాగించే సమయంలో వాహన చోదకులు బాధ్యతయుతంగా హెల్మె ట్లు ధరించాలని బాపట్ల పట్టణ ఎస్సై రజాక్ అన్నారు. బాపట్ల పాత బస్టాండులో గురువారం పేరా లీగల్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో మోటర్ వాహనాల సంబంధిత చట్టాలపై అవగాహన ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయా ణం ప్రమాదకరం శిక్షర్హం అని మోటార్ వాహనాల చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని అలాగే అతివేగంతో వాహనాలు నడపరాదని ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఆ కుటుంబ జీవన ఆర్థిక పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. పిల్లలకు మోటార్ సైకిళ్లను ఇవ్వొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

నూతన దంపతులకు సరోజిని ఆశీస్సులు

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని పేరలి బక్కావారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జోగి సురేష్ సంధ్యారాణిల కుమార్తె పావని అజయ్‌ల వివాహం గురువారం మల్లెవారిపాలెంలో జరిగింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని,జీవన్‌ను నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. నూతన దంతపతులను ఆశీర్వదించిన వారిలో మహిళా నాయకులు కాగిత నాగభూషణమ్మ, హైమావతి, పద్మా, కూచిపూడి ఝాన్సీరాణి, నజ్మా,మస్తాన్‌బీ తదితరులున్నారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత

- పీహెచ్‌సీ వైద్యులు నాగార్జున

విశాలాంధ్ర - నిజాంపట్నం : జనాభా నియంత్రణ మనందరి బాధ్యత అని కూచినపూడి పీహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ ప్రణవీ, సూపర్వైజర్ మురళి అన్నారు.ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సంక్షేమం - దేశ సౌభాగ్యం అని చెప్పారు.జనాభా పెరుగుట వలన నిరుద్యోగ, భూ, ఆహార, నీటి సమస్యలు, ధరలు పెరుగుట ఇవన్నీ ఉత్పన్నమవుతాయన్నారు.మానవాళి మనుగడకి తీవ్ర ఇబ్బందులు, పేదరికం, పర్యావరణ క్షీణత, వనరుల క్షీణత, సామాజిక అసమానతులకు తావిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ సుశీల, మాధవి, హెచ్ఈఓ సాంబ శివరావు, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పీలు పాల్గొన్నారు.

కాశమ్మ దశదినకర్మ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : పొదిలి పట్టణంలోని మాజీ ఎంపీపీ శ్రావణి వెంకటేశ్వర్లు తల్లి శ్రావణి కాశమ్మ గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.గురువారం దశదినకర్మ సందర్భంగా హనుమంతునిపాడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని కాశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి,చీకటి వెంకట సుబ్బయ్య మరియు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

వైయస్సార్ భూ సురక్ష సర్వే పథకం విఫలం

- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో అవకతవకలు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : శాశ్వీత భూ హక్కు మరియు భూ రక్ష పథకం (పునరుద్ధరణ) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైయస్సార్ భూ సురక్ష సర్వే పథకం విఫలమైన సంఘటన పుల్లలచెరువు మండలంలో చోటు చేసుకున్నది. పట్టా భూములుగా ఎఫ్ ఎల్ ఆర్ ప్రకారం నమోదైన భూములు ఇనాం భూములుగా, అసైన్డ్ భూములుగా, రెవెన్యూ రికార్డు ప్రకారం రైతులకు ఉన్న భూములు అవకతవతలుగా నమోదయినట్లు రైతులు తెలియజేస్తున్నారు. తమ భూములను ఎప్పటినుంచో సాగు చేసుకుంటూ పండించుకున్న పంటలు రికార్డును తారుమారు చేశారని రెవెన్యూ సిబ్బంది ఇష్టానుసారంగా బాధ్యత లేకుండా వ్యవహరించారని రైతులు వాపోతున్నారు. సక్రమంగా సరిచేయాలని అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందని రైతుల కోరుతున్నారు. మండలంలోని చౌటపల్లి పట్టా భూములు ఇనాం భూములుగా మార్చాలని వేడుకుంటున్నారు.

రిమ్స్‌లో 'కాసుల కోసం కుల వివక్ష'

◈సంబంధిత డాక్టర్లను సస్పెండ్ చేయాలి

◈రిమ్స్ సూపరింటెండెంట్ దుర్గా దేవికి దళిత నాయకుల ఫిర్యాదు

◈విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సూపరింటిండెంట్ హామీ

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లా కేంద్రమైన ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్‌లో కాసుల కక్కుర్తితో కుల వివక్ష పాటిస్తున్న డ్యూటీ డాక్టర్లును సస్పెండ్ చేయాలని రిమ్స్ సూపరిడెంట్ దుర్గా దేవికి దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, సృజన్ మాదిగ, ధారా అంజయ్య తదితరులు ఫిర్యాదు చేశారు. గురువారం రిమ్స్ హాస్పిటల్లో సూపరిడెంట్ రూమ్లో సూపర్నెంట్‌ను కలిసి క్యాజువాలిటీలో డ్యూటీ డాక్టర్లు చేస్తున్న అక్రమాలను సాక్షాధారాలతో సహా సూపర్నెంట్‌కు వివరించారు. ఎస్సీ ఎస్టీ బాధితులు గాయపడి రిమ్స్ హాస్పిటల్‌కు వస్తే వైద్యం చేయకుండానే వెనక్కు పంపిస్తున్నారని ప్రైవేటు హాస్పటల్లో చేరమని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే కొంతమంది డాక్టర్లు ఎమ్మెల్సీ కేసుల్ని కూడా నాన్ ఎమ్మెల్సీ కేసులుగా రెఫర్ చేస్తున్నారన్నారు. మరి కొంతమంది డాక్టర్లు అడ్మిషన్ చేసుకొని పోలీస్ ద్వారా కానీ మధ్య వర్తుల ద్వారా కానీ రేటు మాట్లాడుకుని అర్ధరాత్రి కూడా బయటకి గెంటివేస్తున్నారన్నారు. మరి కొంతమంది డాక్టర్లు ఎస్సీ ఎస్టీ బాధితుల విషయంలో కొంతమంది డాక్టర్లు చికిత్స చేసిన ఔట్ పోస్టు పోలీసులకు రాతపూర్వకంగా ఇంటిమేషన్ ఇవ్వడం లేదన్నారు. డాక్టర్ ఇంటిమేషన్ లేనిదే తాము సంబంధిత పోలీస్ స్టేషన్లకు కేసు వివరాలు పంపలేమని రిమ్స్ అవుట్ పోస్ట్ పోలీస్ అధికారులు చెప్తున్నారన్నారు. బాధితులను మీరే వెళ్లి మీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకోండి అని కొంతమంది డాక్టర్లు హాస్పటల్ నుంచి పంపించి వేస్తున్నారన్నారు. దీనికి ఉదాహరణగా బల్లికురవ మండలం సూరేపల్లిలో జరిగిన గోగులమూడి. నాగేంద్రం అనే ఎస్సీ ఎస్టీ కేసులో డాక్టర్ అహమద్ భాష వ్యవహరించిన నిరంకుశ కక్కుర్తి విధానాన్ని సూపరిండెంట్‌కు వివరించారు. అలాగే క్యాజువాలిటీలో డ్యూటీలో ఉన్న డాక్టర్లు "ఎప్రాన్"ధరించటం లేదని మెడలో శతస్కోపు కూడా లేకుండా సివిల్ డ్రెస్‌లో కొంతమంది ఉంటున్నారు. డ్యూటీ డాక్టర్లు కొంతమంది క్యాజువాలిటీలో కాకుండా రూమ్స్‌లో రెస్ట్ తీసుకుంటున్నారన్నారు. రెండు నెలల క్రితం ఒంగోలులో మక్కెన వరకుమార్ అను ఆటో డ్రైవర్ను దండే సూర్య అను అంబులెన్స్ డ్రైవర్ మరియు రంగా కొంతమంది ఒంగోలు మంగమూరి రోడ్డులో దాడి చేస్తే రిమ్స్ హాస్పటల్లో అడ్మిట్ అయిన మక్కెన వర కుమారుని డ్యూటీ డాక్టర్ నాని ఎమ్మెల్సీగా నిర్ధారించారన్నారు. వరకుమార్ పై దాడి చేసిన నిందితులతో కుమ్మక్కై నిర్దాక్షిణ్యంగా ఏకువజామున మూడు గంటలకు హాస్పటల్ నుండి బలవంతంగా పంపించారన్నారు. నిన్ను అడ్మిట్ చేసుకుంటే మా ఉద్యోగాలు పోతాయి అని బెదిరించారన్నారు. మరలా 14వ తేదీ వరకుమార్ 108కి ఫోన్ చేసి మరలా గాయాలతో నొప్పులతో బాధపడుతూ రిమ్స్ హాస్పటల్లో చేరారు. 14 నుండి 20 తేదీ వరకు వరకుమార్ అదే హాస్పిటల్‌లో ఎంఆర్ఐ స్కానింగ్‌లు ఎక్రేలు తీయించినారు. గాయాలు ఏమీ లేకపోతే ఎక్రేలు, ఎమ్మారై స్కానింగ్‌లు మరల వారం రోజుల పాటు అడ్మిషన్ వరకుమార్కు మరో గవర్నమెంట్ డాక్టర్ ఎందుకు చేశారో చెప్పాలనీ సూపర్నెంట్‌ను దళిత నాయకులు డిమాండ్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన ఓపి చీటీలు మెడికల్ రిపోర్టులు స్కానింగ్ కాపీలు సూపర్నెంట్ కు అందించారు. పరిశీలించిన సూపర్నెంట్ దుర్గాదేవి డ్యూటీ డాక్టర్ల అందరితో సమావేశం ఏర్పాటు చేస్తామని క్యాజువాలిటీకి వచ్చే ఎస్సీ ఎస్టీ బాధితులను అడ్మిట్ చేసుకోకుండా ఎమ్మెల్సీ కేసును అవుట్ పోస్ట్ కు పంపించని డ్యూటీ డాక్టర్లపై చర్యలు తీసుకుంటామని దళిత నాయకులకు సూపర్నెంట్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో దళిత నాయకులతో పాటు కాకుమాను రవి మరియు బాధితుడు వరకుమార్ తదితరులు ఉన్నారు.

ఇస్లాంపేట ముస్లిం కమ్యూనిటీ హాలు నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-ఒంగోలు : ఇస్లాంపేట ముస్లీం కమ్యూనిటీ హాలు నిర్వహణ కమిటీ నూతన కమిటీ ఎన్నిక గురువారం స్థానిక ఇస్లాంపేట ముస్లిం కమ్యూనిటీ హాలులో సీనియర్ ముస్లిం నాయకులు సయ్యద్ సర్దార్ , గౌస్ భాషా ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ నూతన కమిటీ ఎన్నిక పర్యవేక్షకులుగా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, తెదేపా ముస్లిం నాయకులు హనీఫ్ ఖాన్, కఫిల్ బాషా లు హాజరయ్యారు. 15ఏళ్ళ క్రితం ఇస్లాం పేటలో ఉన్న కమ్యూనిటీ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి దాన్ని ముస్లింల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్ది ఒక మోస్తారు ఫంక్షన్లకు వివాహాలకు అందుబాటులో ఉంచడం తోపాటు దానికి వివిధ సేవా కార్యక్రమాలకు ఉపయోగించడం జరుగుతుందని, ఇదే క్రమంలో గత కమిటీ బాధ్యత సమయం ముగియటంతో గురువారం ఇస్లాంపేటలోని ముస్లిం ప్రజల సమక్షంలో కొత్త కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని రియాజ్ తెలిపారు.రాబోయే కాలంలో ఈ కమిటీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం మరింత మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తుందని కొత్తగా ఏర్పడ్డ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కమిటీ కార్యవర్గం అధ్యక్షులుగా షేక్ అల్లాబక్షు (బక్షి), కార్యదర్శిగా షేక్ రఫీ, కోశాధికారిగా పఠాన్ ముజుబుల్లాఖాన్ తో పాటు నూతనంగా ఉపాధ్యక్షులను సహాయ కార్యదర్శులను ఎన్నుకో వడం జరిగింది. ఈ కార్యక్రమానికి పఠాన్ కరీముల్లా ఖాన్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ప్రతి కౌలు రైతు విధిగా

సీసీఆర్సీ కార్డు

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ప్రతి కౌలు రైతు విధిగా సీసీ ఆర్సీ కార్డు పొందేలా చూడాలని తహశీల్దార్ బి. పద్మావతి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పంట సాగుదారు హక్కు పత్రంపై వీఆర్వోలు, వీఏఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం అందించే పంట రుణాలు, పంటల బీమా పథకం, అన్నదాత సుఖీభవ పథకం, ఇన్పుట్ సబ్సిడీ పొందడానికి సీసీఆర్సీ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జక్కం మెర్సీ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులను పొందేలా చూడాలని తెలిపారు. పంట సాగుదారు హక్కు చట్టం సెక్షన్ 3(8) ప్రకారం సీసీఆర్సీ కార్డు నిర్దేశిత కాలపరిమితి 11 నెలలు మాత్రమేనని, 11 నెలల తర్వాత భూ యజమాని మునుపటి సాగుదారుతో గాని, వేరే వారితో గాని సాగు ఒప్పందం చేసుకోవచ్చన్నారు. పంట సాగుదారు హక్కు చట్టం 2019 సెక్షన్ 5(బి)ప్రకారం ఈ రుణ అర్హ పత్రం సాగుదారునికి నిర్ణీత కాల వ్యవధిలో పండించిన పంటపై మాత్రమే హక్కు కల్పించడమైనదని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-చీమకుర్తి : బూచేపల్లి కమలాకర్‌రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం ఈ నెల 13వ తేదీన శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బూచేపల్లి కళ్యాణమండపం చీమకుర్తి నందు జరుగునని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ల ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సంవత్సరం 927 మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పెద్దలకు వృద్ధులకు చీమకుర్తి మండల పరిసర ప్రాంతాల వారికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడునని ఎంపిక చేసిన వారికి కంటిలోపం అద్దాలును అందిస్తామని, శిబిరానికి వచ్చిన వారందరికీ భోజన వసతి ఉచితంగా కల్పించబడనని, ఈ కార్యక్రమాన్ని శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని వారు, జిల్లా అందత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని కాబట్టి ఈ సదవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఆపరేషన్ అవసరమయ్యే సెలెక్ట్ అయిన వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడునని తెలిపారు. పేషెంట్స్‌కి శంకరా కంటి ఆసుపత్రి పెదకాకాని వారు ససికి చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహించబడుతుందని అందరూ విరివిగా పాల్గొనాలని తెలియజే యడం జరిగింది. శిబిరం వద్దకు వచ్చేవారు రేషన్ కార్డు, ఓటర్ కార్డు,ఆధార్ కార్డు,జిరాక్స్ కాపీలు తీసుకురావాలని తెలిపారు. గుండె జబ్బులు రక్తపోటు మధుమేహం ఉబ్బసం వంటి వ్యాధిగ్రస్తులు ఉన్న వారు తప్పనిసరిగా మందులతో పాటు రశీదు తీసుకు రావాలని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

- మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణ

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మున్సిపాలిటీలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ఏడవ వార్డు గుర్రాల కాలనీ నందు గురువారం కమిషనర్ సైడ్ డ్రెయిన్లు. పారిశుధ్య పనులను పరిశీలించారు. పట్టణంలోని సైడ్ డ్రైన్లలో పూడికతీత పనులు వేగవంతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో వర్షపు మురుగునీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇనిస్పెక్టర్ శ్రీనివాసరెడ్డి. సచివాలయ శానిటేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె అరవపల్లి రహదారి మార్గంలో రేపల్లె పురపాలక సంఘం నిర్వహణలో గల మంచినీటి పంపింగ్ హౌసను గురువారం టీడీపీ నాయకులు శివప్రసాద్ అనగాని పరిశీలించారు.పంపింగ్ హౌస్‌లోని మంచినీటిని ఫిల్టర్ చేసే యంత్రాలను మంచినీళ్ల చెరువును ఆయన పరిశీలించారు. ప్రతిరోజు పట్టణంలో తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత పంపింగ్ హౌస్ సిబ్బందిని ఇంజనీరింగ్ శాఖ అధికారులను మున్సిపల్ కమిషనర్ శేషాద్రిని కోరారు. ఇందుకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే స్వయంగా తన దృష్టికి సమస్యను తీసుకుని వస్తే వెంటనే పరిష్కరించి తాగునీరు సరఫరాకు అంతరాయం లేకుండా తన వంతు సహకారం అందిస్తారని ఈ విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయన వెంట డిఈఈ శివరామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ రోహిణి, మున్సిపల్ రెవెన్యూ ఇనిస్పెక్టర్ వైఎస్ఆర్ ప్రసాద్, వాటర్ వర్క్స్ సిబ్బంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలి

విశాలాంధ్ర-కొల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ చందా నరసింహారావు అన్నారు. గురువారం కొల్లూరు మండల పరిధిలోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులు కల్పించాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పరిమితం చేయాలని, ఉన్నత పాఠశాలల్లో శాఖాపరమైన సమారం పంపడానికి డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొల్లూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు కొక్కిలిగడ్డ నాగరాజు, గేరా రాజేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బొందలపాటి శ్రీనివాసరావు, మండల గౌరవ అధ్యక్షులు బత్తుల సర్వోన్నతరావు, జిల్లా కౌన్సిలర్ నర్ర శివరామకృష్ణలు పాల్గొన్నారు.

ఆక్వా పార్క్ నిర్మాణానికి నిధులు మంజూరు

- ◈ 192 ఎకరాల్లో ఆక్వా పార్క్ నిర్మాణం
- ◈ రూ .189 కోట్లు కేటాయిస్తూ జీవో విడుదల
- ◈ ఇప్పటికే రూ . 84 కోట్లు విడుదల
- ◈ ఆక్వా పార్కు నిర్మాణంతో మరింత అభివృద్ధి
- ◈ కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : ఆక్వా పార్కు ఏర్పాటుతో జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు మత్స్య శాఖ అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సమావేశం అయ్యారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆక్వా పార్కు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిలిస్తూ నిధులు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా సముద్ర తీరం వెంబడి 192 ఎకరాలలో ఆక్వా పార్కు నిర్మించాలని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సముద్రం నుంచి ఏర్పడిన భూభాగంలో మత్స్య సంపద యోజన కింద ఆక్వా పార్కు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. సమీకృత ఆక్వా సాగు చేయడానికి కేంద్రం పి పి (ప్రైవేట్ పార్ట్నర్షిప్) పద్ధతిలో నిర్మించడమే లక్ష్యమన్నారు. సముద్రం నుంచి ఏర్పడిన భూభాగానికి సర్వేనెంబర్ కేటాయిస్తూ అధికారిక అనుమతులపై 571 జీవోను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సదరు భూమి కేటాయింపులకు సిపిఎల్ఏ నుంచి అనుమతులు ఈ నెలలో వస్తాయన్నారు. రూ. 189 కోట్ల వ్యయంతో చేపట్టే ప్రాజెక్టుకు ఇప్పటికే రూ 84 కోట్లు నిధులు విడుదలయ్యి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ ప్రారంభానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఆక్వా పార్కు ప్రాజెక్ట్ తో ఐదు రకాల సెక్టార్లు నిజాంపట్నం ప్రాంతంలో అభివృద్ధిలోకి రానున్నాయని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. దేశంలో అత్యధిక పరిజ్ఞానంతో రూపొందించే మొదటి ప్రాజెక్టుగా ప్రాచుర్యం పొందనుందని ఆయన వివరించారు. కేవలం సముద్రంలోనే దొరికే సివిడ్స్ ఇక్కడ ఉత్పత్తి చేయడం ప్రారంభమవుతుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించడం ఇందులో భాగమేనన్నారు. పండుగప్ప, పీతల వంటి అరుదైన జాతులు హ్యాచరీలు నిర్మాణం ఉందన్నారు. అరుదైన జాతి పీతల పెంపకం, ఎగుమతులు ఆక్వా పార్క్ నుంచి మొదలవుతాయన్నారు. వివిధ రకాల జాతుల మత్స్య సంపద ఉత్పత్తులు, ఎగుమతులకు కేంద్రంగా ఆక్వా పార్కు అభివృద్ధి కానుందని వివరించారు. సముద్రంలో అరుదైన రంగు చేపలను అలంకరణల కొరకు ఉత్పత్తి చేసే ప్రక్రియ ఇక్కడ జరగనుందన్నారు. వీటితోపాటు ఆక్వా టూరిజం అభివృద్ధిలోకి రానుందని, 50 ఎకరాలలో స్పోర్ట్స్ ఫిష్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యమన్నారు. నిజాంపట్నం పర్యాటక ప్రాంతంగా రూపు దిద్దుకోనుందని స్పష్టం చేశారు. జిల్లాకు తలమానికగా ఈ ప్రాజెక్టు నిలవనుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, మత్స్య శాఖ ఏడి పి సురేష్, ఆర్డిఓ హేలాషారోన్, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు అద్దాలు ధ్వంసం... కండక్టర్‌పై దాడి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేసి డ్యూటీలో ఉన్న కండక్టర్ పై కొంత మంది ఆకతాయిలు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని చందోలు లో గురువారం జరిగింది.చందోలు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రేపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం రేపల్లె నుంచి గుంటూరుకు బయలుదేరింది.ఈ క్రమంలో చెరుకుపల్లిలో దోమ నాగలక్ష్మి అనే మహిళ బస్సు ఎక్కి సీట్లో కూర్చుంది.బస్సులో వేరే ప్రయాణికురాలు నుంచొని ఉండటంతో కండక్టర్ ఆ మహిళను కొంచెం జరిగి కూర్చోండి అని చెప్పడంతో నేనెందుకు జరిగి కూర్చుంటాను అని కండక్టర్ పై ఆ మహిళ వాదనకు దిగడంతో బస్సు దిగేయాలని ఆ మహిళను కండక్టర్ చెప్పడంతో నన్ను బస్సు దిగేమంటావా నీ అంతు చూస్తా అంటూ ఆ మహిళ బస్సు దిగేసింది. ఆ బస్సు గుంటూరు వెళ్లి రేపల్లె కు వస్తున్న క్రమంలో బస్సు చందోలు పెట్రోల్ బంకు దగ్గరకు వచ్చేసరికి బస్సును ఆపి ఆ మహిళ కొంత మంది ఆకతాయిలను వెంట తీసుకువచ్చి బస్సు అద్దాలను ధ్వంసం చేసి డ్యూటీలో ఉన్న కండక్టర్ పై దాడి చేసి గాయపరిచారు.కండక్టర్ పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి ముగ్గురుని అదు పులోకి తీసుకున్నామని, మిగతావారు పరారీలో ఉన్నారని, తొందర్లో మిగతా వారిని అదుపులోకి తీసుకుంటా మని ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత కుమారి, రేపల్లె డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చికిత్స పొందుతున్న కండక్టర్ బివి రమణయ్య, డ్రైవర్ జి.వాసుదేవరావును పరామర్శించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 5702 కిట్లు పంపిణీ

మండల విద్యాశాఖాధికారి కె.రత్నశ్రీధర్

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మండల, పట్టణ ప్రభుత్వ పాఠశాలల బడి పిల్లలకు 5702 అందజేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కే.రత్న శ్రీధర్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 96 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 5702 మంది విద్యార్థిని విద్యార్థులకు ఈ కిట్లలో ఉన్న మూడు జతల యూనిఫాం, ఒక జత బూట్లు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ఇటీవల కొత్తగా చేరిన విద్యార్థులకు కూడా ఈ కిట్లు అందజే యడం జరిగిందన్నారు. పదో తరగతి పాసై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు కూడా ఈ కిట్స్ అందజేస్తామన్నారు. అమ్మకు వందనం క్రింద 15 వేల రూపాయలు అమ్మ బ్యాంకు ఖాతాలలో జమవుతాయన్నారు. విద్యార్థుల కు విద్యా బోధన నేర్పే ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఉన్నారని , ఉపాధ్యాయుల కొరత లేదని, పిల్లల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తున్నారని రత్న శ్రీధర్ చెప్పారు. గ్రామ ,పట్టణ ప్రాంతాలలోని విద్యార్థుల తల్లి దండ్రులు మరొకసారి ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి పౌష్టికాహారంతో మధ్యాహ్నం భోజనం కూడా పాఠశాలల్లోనే పెడుతున్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రు లకు విన్నవించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య నేర్పించడానికి అనుభవం గల విద్యావేత్తలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఈ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ ఎందరో విద్యార్థిని విద్యార్థులను అగ్రగామీలుగా తీర్చిదిద్దిన ఘనత ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకే దక్కిందన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా

జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అందరి సహకారంతో ప్రజలకు మేలు జరిగేలా పనిచేస్తానని నూతన జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్‌గా కలెక్టరేట్లో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అన్నింటిలో ప్రజలకు న్యాయం జరిగేలా చూడడం, ప్రజలు ఆనందంగా ఉండటమే లక్ష్యమని చెప్పారు. జిల్లా సంయుక్త కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించిన వారిలో బాపట్ల చీరాల రేపల్లె ఆర్డీవోలు జి. రవీందర్ జి.సూర్యనారాయణ రెడ్డి, హేలా షారోన్, కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, పలువురు తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.